పాతంగల్ చెక్‌పోస్టు వద్ద పటిష్ట బందోబస్తు

- సీఆర్పీఎఫ్ డీఎస్పీ జితేందర్ నందువాల్

చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ జితేందర్ నందువాల్

కోటగిరి, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నామని సీఆర్పీఎఫ్ డీఎస్పీ జితేందర్ నందువాల్ అన్నారు. పొతంగల్‌లోని మంజీరా నది వద్ద మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ఆయన శనివారం పరిశీలించారు. పోలీసులు, ఎస్ఎస్‌టీ బృందం అధికారులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన వెంట పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

మాజీ రిజిస్ట్రార్‌కు సన్మానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : టీయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య నసీం ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా టీయూలో తూటా అధ్యక్షుడు అక్కినపల్లి పున్నయ్య ఆధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పున్నయ్య మాట్లాడుతూ.. నసీం పాఠ్యప్రణాళిక సంఘం చైర్పర్సన్‌గా, డీన్‌గా ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా, కంట్రోలర్‌గా విశ్వవిద్యాలయానికి అంకితభావంతో పనిచేశారని అన్నారు. 17 సంవత్సరాల పాటు విద్యార్థులకు బోధించి, ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేశారని కొనియాడారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరితోపాటు ప్రొఫెసర్లు, అధ్యాపకులు సన్మానించారు.

చిన్నారిపై కుక్క దాడి.. తీవ్రగాయాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 27 : ఓ చిన్నారిపై వీధికుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. గ్రామంలో ఆరేండ్ల చిన్నారి కుర్మ పూజిత రోడ్డుపై శనివారం ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసింది. కింద పడిపోయిన పూజిత గట్టిగా అరవడంతో గమనించిన ఆమె తల్లి పరుగెత్తుకొచ్చి కుక్కను తరిమేసింది. ఈ ఘటనలో చిన్నారికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం డిచ్‌పల్లి సీహెచ్‌సీకి తరలించారు. కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఒకరికి డాక్టరేట్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 27 : టీయూ విద్యార్థి మహ్మద్ తౌసిఫ్ అహ్మద్ డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు. ఫార్మాస్యూటికల్ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ నసీం ఆధ్వర్యంలో 'ఇంపాక్ట్ ఆఫ్ వేరియబుల్ ఆక్సిడేషన్ స్టేట్స్ ఆఫ్ హెవీ మెటల్స్ ఇన్ ఎడ్సెర్ప్షన్ ఆన్ నానో ఎడ్సార్బెంట్ ఇన్ పాజ్‌డ్ విత్ నేచురల్ అక్యూరింగ్ ఆర్గానిక్ యాసిడ్స్' అంశంపై పరిశోధన నిర్వహించి టీయూకి రికార్డులను సమర్పించారు. వైవాకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాదవ్ రాంచందర్ హాజరై ప్రశ్నలు అడిగారు. అనంతరం పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఆరతి, శిరీష, చంద్రశేఖర్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా సర్వరాజ్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని ధర్మారం(బీ) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సర్వరాజ్ ధర్మారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు లక్ష్మీనర్సయ్య, లొక్కిడి గిరి, యూసుఫ్, చిన్నన్న, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలను అమలుచేస్తాం'

సిరికొండ, ఏప్రిల్ 27 : ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలుచేస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని పందిమడుగు, చీమన్‌పల్లి, పాకాల, తూంపల్లి, కొండాపూర్, ముషీర్‌నగర్ తదితర గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బకారం రవి, వెల్మ భాస్కర్‌రెడ్డి, ఉమ్మాజీ నరేశ్, ఎర్రన్న, దేగాం సాయన్న, నర్సారెడ్డి, చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రచారం

వేల్పూర్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి బాల్కొండ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో, సాయంత్రం 5 గంటలకు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద బషీరాబాద్, హాసాకొత్తూర్ గ్రామాల్లో, సాయంత్రం 6:30 గంటలకు మోర్తాడ్ మండల కేంద్రంలో, రాత్రి 8 గంటలకు భీమ్‌గల్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగే రోడ్‌షో, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

వధువు ఇంటికి నిప్పుపెట్టిన వరుడి అన్న

- తమ్ముడు ఇష్టం లేని పెండ్లి చేసుకోవడమే కారణం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 27 : తనకు ఇష్టం లేని అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడన్న కోపంతో వధువు ఇంటికి వరుడి అన్న నిప్పుపెట్టిన ఘటన ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకున్నది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. నగరంలోని శాంతినగర్‌కు చెందిన సనాఖాన్ అనే యువతికి స్థానికుడైన ఎండీ అమర్ ఖాన్‌తో రెండు రోజుల క్రితం వివాహం జరిగింది. ఆ యువతిని పెండ్లి చేసుకోవడం ఇష్టంలేని అమర్‌ఖాన్ అన్న మహ్మద్ మజార్ తన స్నేహితులతో కలిసి శుక్రవారం అర్ధరాత్రి వధువు ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఇంట్లో ఉన్న రూ.80 వేల నగదుతో పాటు ఫర్నిచర్, రెండు సెల్‌ఫోన్లు, బ్యాంక్ బుక్కులు ఇతర వస్తువులు కాలిపోయాయని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మజార్‌ఖాన్‌తోపాటు అతడి స్నేహితులు ఇలియాస్, సోహైల్, సమీర్, ఇమ్రాన్‌పై చర్యలు తీసుకోవాలని పెండ్లి కూతురు నానమ్మ ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలు ఏదీ?
- బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని సుగుణ గార్డెన్‌లో నియోజకవర్గ ఎన్నికల సన్నాహక బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, రైతు భరోసా అంటూ మాయమాటలు చెప్పి, సీఎం అయిన తర్వాత రైతులను పట్టించుకోకుండా హైదరాబాద్-ఢిల్లీ చక్కర్లు కొడుతున్నాడని అన్నారు. కల్యాణలక్ష్మిలో తులం బంగారం, సీఎం సహాయనిధి చెక్కులు, రైతుబంధు, 24 గంటల కరెంట్ సరఫరా, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ఎక్కడ అన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 420 అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారని, బోనస్ లేకపోయినా ధాన్యం కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేని అన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సోషల్ మీడియాలో అబద్ధ ప్రచారాలు చేయడం తప్ప, జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. గత ఎన్నికల్లో ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డు ఐదు సంవత్సరాలు గడిచినా ఇంకా రాలేదని ఎద్దేవా చేశారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన నేతలను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, జడ్పీటీసీ ఇందిరా లక్ష్మీనర్సయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం

ఇందల్వాయి, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మండలంలోని దొన్కల్, గౌరారం, జీకే తండా, లింగాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు శనివారం ప్రచారం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలో బాజిరెడ్డి గోవర్ధన్ చేపట్టిన అభివృద్ధి, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్ నాయక్, వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, గడ్కోల్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దాసు, కుంట నర్సారెడ్డి, శెట్టి బీరీష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'ధాన్యం ఇవ్వకుంటే మార్కెట్ కమిటీకి తాళం వేస్తాం'



కోటగిరి మార్కెట్ కమిటీలో డీడీలు చూపుతున్న రైతులు

- రైతుల హెచ్చరిక
- కోటగిరి మార్కెట్ కమిటీ వద్ద ఆందోళన

కోటగిరి, ఏప్రిల్ 27 : కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీలో తాము రైతుబంధు పథకం కింద ధాన్యం నిల్వ ఉంచామని, నిల్వ ఉంచిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఇవ్వాలని పలుమార్లు మార్కెట్ కమిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోటగిరిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో రైతులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు కింద ఏడాది క్రితం కొంతమంది, ఆరు నెలల క్రితం మరి కొంతమంది మొత్తం 16 మంది రైతులు సుమారు 25 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని మార్కెట్ కమిటీలో నిల్వ ఉంచామని తెలిపారు. ఆ ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ఇవ్వాలని మార్కెట్ కమిటీకి వెళ్తే సంబంధిత కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని, సిబ్బందికి పలుమార్లు విన్నవించినరాస్పందన లేదని వాపోయారు. ధాన్యం నిల్వ ఉంచిన రైతులు డీడీలు కట్టి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.

రైతుల వడ్లను యాక్షన్ ఎలా పెడతారు..?

మార్కెట్ కమిటీలో రైతుబంధు కింద రైతులు నిల్వ ఉంచిన వడ్లను రైతులకు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా యాక్షన్ ఎలా పెడతారని రైతులు ప్రశ్నించారు. మార్కెట్ కమిటీలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని అధికారి యాక్షన్ పెడతామని అనడంపై రైతులు మండిపడ్డారు.

వారంలోగా వడ్లు ఇవ్వకుంటే తాళం వేస్తాం...

మార్కెట్ కమిటీలో నిల్వ ఉంచిన వడ్లను నిబంధనల ప్రకారం రెండు వారాల్లోగా రైతులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని రైతులు తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా మార్కెట్ కమిటీ సెక్రటరీ వడ్లు ఇవ్వకపోవడంతోపాటు అందుబాటులో ఉండడం లేదని అన్నారు. మార్కెట్ కమిటీకి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, వారంలోగా వడ్లు ఇవ్వకుంటే మార్కెట్ కమిటీకి తాళం వేస్తామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు శంకర్‌పటేల్, నాగ్‌నాథ్‌పటేల్, నీరడి ఉదయ్‌భాస్కర్, షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్.. 'ఫ్రీ బస్సు' తప్ప చేసిందేమీ లేదు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

పార్టీ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాజిరెడ్డి, బిగాల, జీవన్‌రెడ్డి, దాదన్నగారి విఠల్‌రావు, నీతూకిరణ్, జగన్ తదితరులు

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి, ఏప్రిల్ 27 : ఎన్నికల్లో హామీలను ఇచ్చి వందరోజుల్లో అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం తప్ప చేసిందేమీ లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, సీఎంగా తొమ్మిదేండ్లలో తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలు మళ్లీ మార్పు కోరుకుంటున్నారంటే పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పంటలు దెబ్బతిని రైతులు ఆవేదన చెందుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఎందుకు ఓటు వేయలేదని ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

డిచ్‌పల్లి మండలకేంద్రంలోని సుగుణ గార్డెన్ బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించగా.. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్.. రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీజీ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, దాసరి ఇందిర, సీనియర్ నాయకులు లక్ష్మీ నర్సయ్య, నీరడి పద్మారావు, కుంచాల రాజు, బెల్దారి గోపి, రాజు, చిన్నన్న, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. డిచ్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సిర్ప రాజు, ఎనుగందుల మురళి, కరిపె రాజు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో ..

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్27: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, జడ్పీటీసీ సంతోష్, నాయకులు సుంకరి రవి, రాజ బాబు, నర్మె నవీన్, దోండి శ్యామ్, లతీఫ్, దేవయ్య, సురేశ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ రెంజల్ మండల మునూరు కాపు సంఘం ప్రతినిధులు, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డాక్టర్ తెలంగాణ శంకర్‌తోకలిసి శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు.
-రెంజల్, ఏప్రిల్ 27

నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘం ప్రాంగణంలో 'మానవత్వానికి సత్కారం' కార్యక్రమాన్ని హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సమాజసేవ చేస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయిబాబును హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, ప్రముఖ న్యాయవాది మహేందర్‌రెడ్డి తదితరులు సన్మానించారు.
– సుభాష్‌నగర్, ఏప్రిల్ 27

ధర్పల్లిలోని ఆదర్శ కళాశాలలో చదివి ఇంటర్‌లో ఉత్తమ మారులు సాధించిన కేటీ రాజశ్రీని గ్రామస్తులు శనివారం సన్మానించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 1000 కి 980 మార్కులు సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు.
– ధర్పల్లి, ఏప్రిల్ 27

కమ్మర్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పూజాకార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. గౌడసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు.
– మోర్తాడ్(కమ్మర్‌పల్లి), ఏప్రిల్ 27

విద్యార్థులకు అభినందనలు

విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో, ఉపాధ్యాయినులు

బాల్కొండ, ఏప్రిల్ 27: ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులను డీఈవో దుర్గాప్రసాద్, అధ్యాపకులు శనివారం అభినందించారు. రితిష (సీఈసీ-472/500) రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు, జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు, సీహెచ్.వైష్ణవి (ఎంపీహెచ్‌డబ్ల్యూ 966/1000) రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా వీరిని, ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరంలో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

దాడులకు దారితీస్తున్న ఇసుక అక్రమ రవాణా?

శక్కర్‌నగర్, ఏప్రిల్ 27: అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణా దాడులకు దారితీస్తున్నదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. అనుమతులు పొందేది కొన్ని వాహనాలకే అయినా, అనుమతులు లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే విషయం అధికారుల దృష్టికి వచ్చినా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. బోధన్ మంజీరా పరీవాహక ప్రాంతంలోని నదినుంచి ఇసుక తరలిస్తున్న వారి సంఖ్య పెద్దమొత్తంలోనే ఉంది. అనుమతులు పొందామంటూ... పలువురు నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లను మంజీరా నదిలో, అనుమతులు అందించిన అధికారులు అక్కడికి రాకముందే వాహనాలు నిలిపిఉంచుతున్నారు. ఇసుక రవాణా చేస్తున్న పలువురి మధ్య మంజీరాలోనే గొడవలు జరుగడంతో, ఆరోజు ఇసుక రవాణాను రెవెన్యూ అధికారులు ఆపివేసిన సందర్భాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, చిన్నచిన్న వ్యాపారులు అధికారుల కళ్లుకప్పి ట్రాలీ ఆటోల్లో ఇసుకను తీసుకొస్తూ బోధన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో డంప్ చేసి అక్కడి నుంచి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తూ విక్రయిస్తున్నారు. నిరుపేదలు ఇండ్లు నిర్మించుకునేందుకు దొరకని ఇసుక, అక్రమార్కులకు సులభంగా లభ్యం అవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఈనెల 26న రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారి మధ్య జరిగిన ఘర్షణ, దాడులు ఇసుక అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతున్నదనే దానికి నిదర్శనంగా మారింది. బోధన్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌లను గుర్తించడంలో, వాటిని పర్యవేక్షించడంలో, ఇసుక ఎలా వచ్చిందనే విషయాలను అధికారులు గుర్తించకపోవడం శోచనీయంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతుపై కేసు నమోదు

నవీపేట, ఏప్రిల్ 27: మండల కేంద్రంలో బాసర రహదారిపై ధాన్యం కుప్పను ఢీకొని ఒకరు మృతి చెందగా ఇందుకు కారణమైన రైతు మునీర్ పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని శివతండాకు చెందిన మునీర్ అయ్యప్ప ఆలయం వద్ద బాసర రహదారిపై ధాన్యం కుప్పను ఆరబెట్టాడు. ఈ క్రమంలో ఈనెల 22న నాగేపూర్ గ్రామానికి హకీల్(విక్కి), నవతేజ్‌తో కలిసి మేస్త్రీ నేత సాయిలు నవీపేటకు బైక్‌పై బయల్దేరాడు. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పను ఢీకొని నేత సాయిలు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో విచారణ చేపట్టి రైతు మునీర్‌పై కేసు నమోదు చేసినట్ల ఎస్సై చెప్పారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నందిపేట్, ఏప్రిల్ 27: మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామానికి చెందిన ఎస్‌కే సహదా (30) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై రాహుల్ శనివారం తెలిపారు. సహదా భర్త అబీబ్ గ్రామంలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సహదా ఇటీవల ఇంటి సమీపంలోని నల్లా వద్ద పక్కింటి కుమ్మరి లక్ష్మి, జింకల పోసానితో గొడవపడింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి, మనస్తాపంతో ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

రెంజల్, ఏప్రిల్ 27: మండలంలోని నీలా - బోర్గాం గ్రామాల శివారులో వీధి కుక్కల దాడిలో జింకకు గాయాలైనట్లు నీలా గ్రామ యువకులు శనివారం తెలిపారు. జింకకు తీవ్ర గాయాలు కావడంతో యువకుడు సాయి యాదవ్ పశువైద్యాధికారికి సమాచారం అందించారు. సహాయ పశువైద్యాధికారి భీమ్‌రావు వైద్యం అందించడంతో కోలుకున్న జింకను ఫారెస్టు బీట్ అధికారి సుధీర్‌కు అప్పగించారు.

కూలీలకు పనిముట్లు మంజూరు చేయాలి

ముప్కాల్, ఏప్రిల్ 27: ఉపాధిహామీ కూలీలకు పనిముట్లను మంజూరు చేయాలని భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ మహిమూద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పనుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలని అన్నారు. ఆ సంఘం జిల్లా సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **ఓటరు స్లిప్పుల పంపిణీ-** కోటగిరి/ముప్కాల్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్వోలు శనివారం ఇంటింటికీ తిరిగి స్లిప్పులను పంపిణీ చేశారు. మే 2వ తేదీలోగా పంపిణీ ప్రక్రియ పూర్తిచేస్తామని కోటగిరి, పొతంగల్ తహసీల్దార్లు సునీత, మల్లయ్య తెలిపారు.
ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, నల్లూర్, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల్, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం ఓటర్లకు స్లిప్పులను సిబ్బంది పంపిణీ చేశారు. తహసీల్దార్ వనజా రాణి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గంగారాం, బీఎల్వోలు పాల్గొన్నారు.
- **ఆహార ఉత్పత్తులపై మహిళలకు అవగాహన -** రుద్రూర్, ఏప్రిల్ 27 : మండలంలోని రాయకూర్‌లో ఆహారశాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మహిళలకు ఆహార ఉత్పత్తులపై శనివారం అవగాహన కల్పించారు. కళాశాల ఆధ్వర్యంలో గ్రామంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస